క్లుప్తంగా

ప్రతి మహిళకు కుట్టు శిక్షణ తప్పనిసరి



వేమూరు: కుట్టు మిషన్ నైపుణ్యత ప్రతి మహిళకు అవసరమని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మహిళలకు కుట్టులో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు కుట్టుకలో శిక్షణ పొందడం వల్ల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవచ్చన్నారు. ప్రతి మహిళకు కుట్టు శిక్షణ అవసరమన్నారు. ఉషా కంపెనీ, విజయవాడకు చెందిన వాస్తవి మండలి, తెనాలి ఏఐఆర్‌టీడీఎస్ సంస్థ సంయుక్త అధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ తెలిపారు. కుట్టు శిక్షణ పొందిన ప్రతి మహిళకు ఉచితంగా కుట్టు మిషన్ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉషా కంపెనీ డిప్యూటీ మేనేజరు టి.రాజ్ కుమార్, యర్రు సాంబ శివరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంతెనవారిపాలెంలో వైద్య శిబిరం

పిట్టలవానిపాలెం: మంతెనవారిపాలెం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చందోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు లీలా క్రాంత్ కర్మల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక వైద్యనిపుణులు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.

ఓలేరులో..

భట్టిప్రోలు: ఓలేరు సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరుగుతుందని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొని సేవలు అందిస్తారని పేర్కొన్నారు.

నేడు పట్టణంలో వైద్య శిబిరం

బాపట్ల అర్బన్: బాపట్ల పురపాలక సంఘం పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్, విశ్వ బ్రాహ్మణ కాలనీలో ఈ నెల 10న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కోన రఘుపతి, కలెక్టర్ రంజిత్ బాషా పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి



నిజాంపట్నం: ప్రథమ చికిత్స విధానాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బాపట్ల జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ వసంతం వీర రాఘవయ్య అన్నారు. మండలంలోని కొమరవోలు ఏడాబ్ ఓవర్ సెస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సోమవారం సంస్థ సిబ్బందికి ప్రథమ చికిత్స విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విపత్తులు సమయంలో, ప్రమాదాల భారిన పడి గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించి, వైద్యశాలలకు తరలిస్తే ప్రాణాపాయం తప్పుతుందన్నారు. శిక్షణలో పాల్గొన్న సిబ్బందికి సర్టిఫికెట్‌లు అందజేశారు. నిజాంపట్నం సొసైటీ చైర్మన్ కాశేపల్లి గౌరీశంకర్, సభ్యులు డీఎల్ శ్రీనివాస్, ట్రైనర్ రత్నశేఖర్ పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టుకు మణికంఠారెడ్డి ఎంపిక



కర్లపాలెం: తమ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ చదువుతున్న పి.మణికంఠారెడ్డి ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు పీకేఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డీజీ నాయుడురెడ్డి తెలిపారు. మణికంఠా రెడ్డికి సోమవారం కళాశాలలో అభినందించారు. కళాశాల పీడీ పి.వెంకటతిరుపతిరెడ్డి మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–19 కబడ్డీ జట్టు ఎంపికలు ఈనెల 6న చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగాయని తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో గుంటూరు జిల్లా జట్టుకు మణికంఠారెడ్డి ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు.

పేదల ప్రభుత్వం.. ఇంటి ముంగిటకు వైద్యం



కొల్లూరులో శిబిరంలో మందులు తీసుకునేందుకు బారులు తీరిన ప్రజలు

కొల్లూరు: కొల్లూరు సచివాలయం–1 పరిధిలోని బాలురోన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. 645 మందిని వైద్యులు పరీక్షించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు, తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, చిలుమూరు ఎంపీటీసీ సభ్యుడు అమిరిశెట్టి శ్రీధర్, ఎంఈఓ–2 టీవీఎస్. జ్యోతి, వైద్యులు పావని, మౌనిక, వి.కావ్య తేజ, బి.రాజ్‌కుమార్, ఎ.సుష్మ, పాఠశాల విద్యా కమిటీ చైర్ పర్సన్ జ్యోతి, పంచాయతీ ఈఓ బి.మల్లికార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

పేదల పాలిట వరం జగనన్న ఆరోగ్య సురక్ష

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సుర క్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ లిఖిత, జనరల్ ఫిజీషియన్‌లు డాక్టర్ లీలా క్రాంత్ కర్మల్, డాక్టర్ సుహానా బేగం, డాక్టర్ లోకేష్, ఎంఎస్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ అశ్విత, గైనకాలజిస్టు డాక్టర్ భువన పాల్గొని 800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు ఉచితంగా అందజేశారు. గ్రామ సర్పంచ్ గౌరీదేవి విజయకుమారి కార్యక్రమంలో పాల్గొని, పర్యవేక్షించారు. ఉప సర్పంచ్ చేబ్రోలు వీరయ్య, ఎంపీటీసీ సభ్యుడు చల్లాపల్లి విజయరాజు, అధికారులు, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

550 మందికి వైద్య పరీక్షలు

రేపల్లె రూరల్: మండలంలోని పేటేరు గ్రామంలో పరుచూరి బలరామయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కనపర్తి వసుమతి శిబిరాన్ని ప్రారంభించారు. 550 మంది పేటేరు, పరిసర ప్రాంత ప్రజలకు రేపల్లె, పేటేరు వైద్యశాలల సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివపార్వతీ, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ కనపర్తి రవికిరణ్, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. నల్లూరుపాలెం జడ్పీ హైస్కూలులో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివపార్వతీ తెలిపారు.

300 మందికి వైద్య పరీక్షలు

ఏట్రవారిపాలెం(కర్లపాలెం): ఏట్రవారిపాలెంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు మురళి, రమేష్, శ్రీమౌనిక, విజయేంద్ర సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ పద్మావతి, తహసీల్దారు కేశవ నారాయణ రావు, ఈఓపీఆర్డీ ఎలీషాబాబు, కార్యదర్శి డి.పద్మావతి, మాజీ సర్పంచ్ చీరాల సత్యనారాయణరెడ్డి, చీరాల శ్రీనివాసరెడ్డి సచివాలయం సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



చందోలులో మందులు అందజేస్తున్న సిబ్బంది

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నగరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బొరమా దిగపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో 506 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. వీరిలో మెరుగైన వైద్య పరీక్షలకు 21 మందిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు భవానీశ్రీ, తులసిరాజేశ్వరి, ఎంపీటీసీ శ్రీమన్నారాయణ, ఉప సర్పంచ్ నల్లూరు రత్నబాబు, సీహెచ్‌వో బాబురావు, వైఎస్సార్ సీపీ నాయకుడు కొండల రెడ్డి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

450 మందికి వైద్య పరీక్షలు

నిజాంపట్నం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మండలంలోని బొర్రావారిపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ శిబిరంలో కూచినపూడి పీహెచ్‌సీ వైద్యులు నాగార్జున, సాయిదీప్తి, ఫణీంద్ర, యశోదన్ 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కేసన నాగముత్యాలమ్మ, కేసన సోమయ్య, సూపర్‌వైజర్ మురళీ పాల్గొన్నారు.



ఏట్రవారిపాలెంలో శిబిరానికి హాజరైన ప్రజలు



పల్లెకోనలో కిట్‌ల పంపిణీ



జమ్ములపాలెంలో కిట్ అందజేస్తున్న వైద్యురాలు

పల్లెకోనలో..

పల్లెకోన(భట్టిప్రోలు): పల్లెకోనలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 631 మందికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు ఎ. శ్రీనివాసరావు, సీహెచ్ రామలక్ష్మి, రాజేశ్వరి, శశికాంత్, ఎ. శ్రీనివాసరావు, ఆప్తమాలజిస్ట్ అరుణరాణి పాల్గొని వైద్య సేవలు అందించారు. ఎంపీటీసీ దున్నా తిరుపతిబాబు, మండల ప్రత్యేక అధికారి, ఎం. హనుమంతరావు, ఎంఈవో నీలం దేవరాజు, తహసీల్దారు డి. వెంకటేశ్వరరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, ఈవోపీఆర్డీ టి. ఊహారాణి, ఇన్‌చార్జ్ సెక్రటరీ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

జమ్ములపాలెంలో..

బాపట్ల అర్బన్: చెరువు జమ్ములపాలెం గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. మొత్తం 445 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. డాక్టర్ వెంకటేష్, వైద్య సిబ్బంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో ఎ.రాధాకృష్ణ, ఈఓపీఆర్డీ పులి శరత్ బాబు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న తహసీల్దారు శ్రీనివాసరావు



బొర్రావారిపాలెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పిచ్చి కుక్కలు కరిచిన గేదెలు రేబిస్‌తో మృతి

కొల్లూరు : పిచ్చి కుక్కల కరవడంతో పశువులు అనారోగ్యం భారిన పడి మృతి చెందిన ఘటన మండలంలోని కిష్కిందపాలెంలో చోటుచేసుకుంది. పశువుల యజమానుల కథనం మేరకు.. నెల రోజుల క్రితం గ్రామానికి చెందిన పులివర్తి కృపానందం, పోలిమట్ల ఏబులకు చెందిన రెండు పశువులు కుక్క కాటుకు గురయ్యాయి. విషయం తెలియని యజమానులు వాటికి ఎటువంటి వైద్య సేవలు అందించకుండా మిన్నకుండిపోయారు. కుక్క కాటుకు గురైన రెండు పశువులకు రేబీస్ వ్యాధి ముదరడంతో సోమవారం ఉన్న పళంగా మృతి చెందాయి. కృపానందానికి చెందిన ఈతకు వచ్చిన గేదె మృతి చెందడంతో రూ. 50 వేలు, ఏబుకు చెందిన గేదె మరణించడంతో రూ.25 వేల వరకు నష్టం వాటిల్లిందని వారు వాపోతున్నారు. గ్రామంలో ఇటీవల కుక్కల బెడద అధికమయ్యిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కిష్కిందపాలెంలో మరణించిన పశువు వద్ద యజమాని..

గొడ్లచావిడి, పూరిల్లు ఆహుతి

- ప్రమాదంలో సజీవ దహనమైన మూగజీవాలు
- రూ.4.50లక్షల ఆస్తి నష్టం

రేపల్లె రూరల్: ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం వాటిల్లి గొడ్ల చావిడితో పాటు పాక్షికంగా పూరిల్లు దగ్ధమై మూగజీవాలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని చాట్రగడ్డ పంచాయతీ మైనేనివారిపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి వై.సాంబశివరావు వివరాల మేరకు.. మైనేనివారిపాలెం గ్రామంలో నివాసం ఉంటున్న వుడ భిక్షాలుకు తన గొడ్లచావిడిలో దోమలు నివారించేందుకు ఏర్పాటు చేసిన పొగ కుంపటి నుంచి మంటలు చెలరేగాయి. ఈ మంటలు చావిడికి అంటుకున్నాయి. దీనిని గమనించిన స్థానికులు చావిడిలోని మూడు గేదలను, ఒక పెయ్యి ఆవును మంటల భారిన పడకుండా కాపాడారు. అప్పటికే చావిడిలో ఉన్న ఒక పాడిగేద, ఒక చూడి గేద, ఒక దూడ, మేక, కోళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. చావిడి పక్కనే ఉన్న భిక్షాలు పూరిల్లు కొద్దిమేర మంటలు వ్యాప్తి చెంది దగ్ధమైంది. ప్రమాదంలో రూ.4.50లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. బొబ్బర్లంక పశువైద్యాధికారి పి.మీనాక్షి దేవి తమ సిబ్బందితో ఘనస్థలానికి చేరుకుని పశువులకు వైద్య సేవలు అందించారు.



దగ్ధమైన గొడ్ల చావిడి

గ్రంథాలయ శాఖ అధికారికి సత్కారం

బాపట్ల అర్బన్: గ్రంథాలయాధికారిగా పనిచేస్తున్న ఎ. శివాజీ గణేశన్ 20ఏళ్లుగా విశేషమైన సేవలు అందిస్తున్నందుకు పాఠకులు, సిబ్బంది సోమవారం ఆయనను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాపట్ల ఎంపీడీఓ ఎ.రాధాకృష్ణ పాల్గొన్నారు. శివాజీ గణేశన్ నిబద్ధత కలిగిన వ్యక్తి అని కొనియాడారు. రచయిత ఎ.మల్లికార్జున, చిత్రకారుడు జీవీ ఎం.నరసింహారావు, శేషాద్రినాయుడు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

చెరుకుపల్లి: రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా ఎన్నో లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ తూర్పుపాలెం ఐసీఆర్పీ రేపల్లె పావని అన్నారు. పైరులో పురుగు నివారణకు కోడిగుడ్లు, నిమ్మ రసం కషాయం వినియోగించాలని తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని తూర్పుపాలెం పంచాయతీ బడేవారిపాలెంలో కోడిగుడ్లు, నిమ్మరసం కషాయం తయారు చేసే విధానాన్ని సోమవారం రైతులకు వివరించారు. ఈ ద్రావణాన్ని ఎకరాకి 200 నుంచి 300 గ్రాముల వరకు సరిపడా నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. పి.సాంబశివరావు, పి.శివసుబ్రహ్మణ్యం, బి.శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు.

జీఎన్‌పాలెంలో 'ఉపాధి హామీ' సామాజిక తనిఖీ గ్రామ సభ

పిట్టలవానిపాలెం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పేదలు ధీమాగా జీవించవచ్చని గోకరాజునల్లిబోయినవానిపాలెం గ్రామ సర్పంచ్ దబ్బకూటి మాధవరావు అన్నారు. మండలంలోని జీఎస్.పాలెం గ్రామ సచివాలయంలో సోమవారం ఉపాధి హామీ పథకం 2022–23 ఆర్థిక సంవత్సరానికి సామాజిక తనిఖీ గ్రామ సభను నిర్వహించారు. సామాజిక తనిఖీ బృంద సభ్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ మొత్తం 580 మంది కూలీలకు పని కల్పించడం జరిగిందన్నారు. ఏడాదిలో రూ.3 లక్షల విలువ గల పనులు చేసినట్లు వెల్లడించారు. నలుగురు కూలీలు ఏడాదిలో వంద రోజులు కూలీ చేసినట్లు తెలిపారు. పని ప్రదేశం వద్ద కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు కూలీలు ఉన్నారు.



మాట్లాడుతున్న గ్రామ సర్పంచ్ మాధవరావు

●బాపట్ల ప్రతినిధిగా..



విజయవాడలోని ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియంలో సోమవారం జరిగిన వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభకు బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి హాజరయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ఆసాంతం ఆసక్తిగా వీక్షించారు.

రుణ మంజూరు జాప్యంపై డ్వాక్రా మహిళల ఆందోళన

కొల్లూరు: బ్యాంకర్ల నిర్లక్ష్యం కారణంగా తమకు రుణాల మంజూరులో జాప్యం జరగడంతో డ్వాక్రా మహిళలు బ్యాంక్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ ఘటన సోమవారం కొల్లూరులో చోటుచేసుకుంది. డ్వాక్రా మహిళలు, వెలుగు అధికారుల కథనం మేరకు.. కొల్లూరు గౌడపాలెం ప్రాంతానికి చెందిన నాలుగు డ్వాక్రా గ్రూప్‌లకు చెందిన మహిళలు గతంలో కొల్లూరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌లో డ్వాక్రా రుణాలు పొందారు. గతంలో ఉన్న మహిళా మేనేజర్‌కు, డ్వాక్రా యానిమేటర్‌కు మధ్య సమన్వయం లోపంతో నాలుగు గ్రూప్‌ల ఖాతాలను యూనియన్ బ్యాంకుకు మళ్లించారు. సదరు యూనియన్ బ్యాంకు మేనేజర్.. ఏపీఎం, సీసీల సంతకాలు లేకుండానే ఈ నాలుగు గ్రూప్‌లకు రూ. 20 లక్షల లోన్ మంజూరు చేశారు. చైతన్య గోదావరి బ్యాంకులో ఉన్న బకాయి చెల్లింపు కోసం ఆ బ్యాంకుకు రూ.16 లక్షల వరకు నగదు మళ్లించారు. సోమవారం చైతన్య గోదావరి బ్యాంకు నుంచి ఎన్‌ఓసీ తీసుకునేందుకు డ్వాక్రా మహిళలు వెళ్లడంతో మేనేజర్‌కు డ్వాక్రా మహిళలకు వివాదం చోటుచేసుకుంది. తమ బ్యాంకులో ముందస్తుగా లోన్ చెల్లింపులు జరపకుండా ఎన్‌ఓసీ మంజూరు చేయడం కుదరదని తెలపడంతో డ్వాక్రా మహిళలు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఏపీఎం రాము బాంకుకు వెళ్లి ఇరు బ్యాంకుల అధికారులతో చర్చించారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి, రుణాలు వర్తింప జేస్తామని తెలపడంతో మహిళలు ఆందోళన విరమించారు.



చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఎదుట డ్వాక్రా మహిళల ఆందోళన

స్పందనకు ఐదు అర్జీలు

రేపల్లె: స్పందన కార్యక్రమానికి ఐదు అర్జీలు అందినట్లు ఆర్డీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి జాన్ పీటర్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్జీలు స్వీకరించారు. డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని చుండూరు గ్రామం నుంచి ఒక అర్జీ అందిందన్నారు. అదే విధంగా పేటేరు గ్రామంలో హైవే నిర్మాణంతో కోల్పోయిన భూమికి నష్టపరిహారం అందించాలని, ప్రజ్ఞం గ్రామంలో భూమిని ఆన్‌లైన్ చేయాలని, సింగుపాలెం గ్రామంలో వ్యవసాయభూమికి నీటి పారుదల సౌకర్యం కల్పించాలని, తడిచిన ధాన్యానికి నష్టపరిహారం అందించాలని కోరుతూ రేపల్లె గ్రామం నుంచి అర్జీలు అందినట్లు తెలిపారు. సమస్యలను పరిశీలించి, పరిష్కరించనున్నట్లు చెప్పారు.

తీరప్రాంత రైల్వే సమస్యలు పరిష్కరించాలి

పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి మోహనరావు

రేపల్లె: బడ్జెట్‌లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అక్టోబర్ 10న కేంద్ర ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీ బడ్జెట్ సమావేశాలలో తీరంలో రైల్వే సమస్యలు పరిష్కరించేందుకు పార్లమెంట్ సభ్యులు ప్రత్యేక చొరవ చూపాలని పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి సీవీ మోహనరావు కోరారు. స్థానిక పట్టణాభివృద్ధి సంఘ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. మచిలీపట్నం – రేపల్లె – నిజాంపట్నం– బాపట్ల రైల్వే లైన్ ఏర్పాటు అంశంపై సమావేశంలో చర్చించాలన్నారు. రేపల్లె రైల్వే స్టేషన్ ఏరియాలో 'పిట్' సౌకర్యం ఏర్పాటు చేయుటకు, రేపల్లె – సికింద్రాబాద్ మధ్య నడిచే 17626, 17646 ఎక్స్ ప్రెస్‌లను లింగంపల్లి వరకూ, సికింద్రాబాద్ రేపల్లె మధ్య నడిచే 17625, 17645 ఎక్స్ ప్రెస్‌లను లింగంపల్లి నుంచి రెపల్లెకు నడుపుటకు, 17626 ఎక్స్‌ప్రెస్ రేపల్లె నుంచి సికింద్రాబాద్‌కు ఉదయం 5 గంటలకు, లింగంపల్లికి ఉదయం 5.30 గంటలకు చేరేవిధంగా ప్రజా ప్రతినిధులు రైల్వే శాఖకు తెలియజేయాలని కోరారు.